క్లుప్తంగా

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

నారాయణఖేడ్: ఉద్యోగులు విధుల పట్ల బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి లఅన్నారు. మనూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ జయశ్రీ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు జనాలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. త్వరలో శాఖల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తానని తెలిపారు. పలువురు సభ్యులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. పదవీకాలం పూర్తవుతున్న ఎంపీటీసీలు, ఎంపీపీని ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. సమావేశంలో జెడ్పీటీసీ పుష్పబాయి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంపీ షెట్కార్‌కు సన్మానం

కల్హేర్(నారాయణఖేడ్): కాంగ్రెస్ మండల నాయకులు జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించడంతో ఆయనను ఘనంగా సన్మానించారు. ఎంపీని కలిసిన వారిలో పార్టీ అధ్యక్షుడు పోచయ్య, నాయకులు దేవదాస్, మోహన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, నారాయణ, వడ్ల అనిల్, ఇషేకార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం అమ్మితే చర్యలు

జహీరాబాద్ టౌన్: దాబాల్లో మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రాం మోహన్‌రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో దాబాలు, హోటళ్ల, రెస్టారెంట్ యాజమాన్యంతో బుధవారం రాత్రి సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని హోటళ్లు, దాబాలు, బార్‌లు రాత్రి 12 గంటల తరువాత బంద్ చేయాలన్నారు. వీటిల్లో తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో టౌన్ సీఐ రవి, ఎస్సైలు శ్రీకాంత్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

కల్తీ పదార్థాలు విక్రయిస్తే కేసులు తప్పవు

సంగారెడ్డి టౌన్: కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ధర్మేందర్ హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని ఎమ్ఎన్ఆర్ కళాశాల దగ్గరలోని ప్రైవేట్ హాస్టల్లో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడువు దాటిన ఆహార పదార్థాలను విక్రయించినా, కుళ్లిన పదార్థాలను నిల్వ ఉంచి కస్టమర్లకు అందజేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎంపీడీఓకు వినతిపత్రం అందజేత

నారాయణఖేడ్: మండలంలోని ఆధార్ సెంటర్‌లో సదుపాయాలు కల్పించాలని సీపీఎం నాయకులు రమేష్ గురువారం ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రెండేళ్ల వయసు పైబడిన పిల్లల వివరాలను నమోదు చేసేందుకు ఆప్షన్ ఇవ్వలేదని, దీంతో అమీర్‌పేట్‌లోని ప్రధాన కార్యాలయానికి వెళ్తే మాత్రమే నమోదు చేసే అవకాశం ఉంటుందని స్థానిక కేంద్రాల నిర్వాహకులు సమాధానం చెబుతున్నారన్నారు. అధికారులు స్పందించి స్థానిక ఆధార్ కేంద్రాల్లో వివరాల నమోదుకు సదుపాయం కల్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో సీపీఎం నాయకులు సతీష్, గణేష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా యోగా దినోత్సవం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల తెలంగాణ ప్రభుత్వ మోడల్ పాఠశాలలో భారత్‌వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా మాస్టారు త్రివేణి యోగా అసనాలను నేర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ భారత్ వికాస్ పరిషత్ అధ్యక్షుడు దాసరి సతీష్‌గౌడ్ హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నారాయణఖేడ్: అంగన్‌వాడీ టీచర్లకు పెండింగ్ వేతనాలను చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు చిరంజీవి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. దాదాపు 49 ఏళ్ల గడుస్తున్నా చాలీచాలని వేతనాలు ఇస్తున్నారన్నారని, అందువల్ల ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లకు పెండింగ్ వేతనాలతో పాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

క్షయ వ్యాధిపై అవగాహన ఉండాలి

పటాన్‌చెరు టౌన్: ప్రతిఒక్కరికీ క్షయ వ్యాధిపై అవగాహన ఉండాలని టీబీ అలర్ట్ ఇండియా ప్రతినిధి స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ పురుషోత్తం అన్నారు. పాశమైలారం పారిశ్రామికవాడలోని సెనర్గ్ గ్లోబల్ టూల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో టీబీపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ.. ఎవరికైనా క్షయవ్యాధి లక్షణాలు ఉన్నట్లు అనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జిల్లా క్షయ నిర్మూలన కార్యక్రమం సిబ్బంది దేవేందర్‌రాజ్, టీబీ అలర్ట్ ఇండియా డిస్టిక్ ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అమాత్య.. ఇవిగో సమస్యలు

- ఏళ్లు గడుస్తున్నా పరిష్కారానికి నోచుకోని సమస్యలు
- మంత్రి దామోదరకు వివరించేందుకు సిద్ధమైన ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రజలు
- నేడు తెల్లాపూర్ మున్సిపాలిటీ కార్యాలయం ప్రారంభోత్సవం

పట్టణంలోని తెల్లాపూర్ మున్సిపాలిటీ మహానగరాన్ని తలపించేవిధంగా అభివృద్ధితో దూసుకుపోతోంది. ఈ ప్రాంతంలో ఐటీ నిపుణులు, ఎన్ఆర్ఐలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, వ్యాపారస్తులు స్థిర నివాసాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. కానీ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలపై గతంలో స్వతంత్ర కౌన్సిలర్లు, కాంగ్రెస్ కౌన్సిలర్లు ఉద్యమించారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం, మొదటిసారిగా వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెల్లాపూర్‌లో నూతనంగా నిర్మించిన మున్సిపల్ భవన ప్రారంభోత్సవానికి నేడు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. దీంతో మున్సిపాలిటీలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లేందుకు వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు సిద్ధమవుతున్నారు. మంత్రి కృషితో సమస్యలు పరిష్కారమవుతాయని వారు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)

రింగ్‌రోడ్డు కారణంగా పట్టణ ప్రాంతంలో భూముల విలువ ఆకాశాన్ని అంటుతోంది. దీంతో రియల్ వ్యాపారులు చెరువులను, కుంటలను, వరద కాలువలను సైతం వదలడంలేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా జోరుగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో చెరువులు, కుంటలు, వరద కాలువలు వాటి ఉనికిని కోల్పోతున్నాయి.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థను ఆధునికరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడంలేదు.

అసంపూర్తిగా కూరగాయల మార్కెట్

మున్సిపాలిటీ పరిధిలో కూరగాయల మార్కెట్ లేకపోవడంతో స్థానికులు దూర ప్రాంతాలకు వెళ్లి కూరగాయలను తీసుకోరావాల్సిన పరిస్థితి ఏర్పడటంతో గత ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం కోసం శ్రీకారం చుట్టింది. అందుకోసం రూ.2కోట్లు నిధులను మంజూరు చేసి పనులను ప్రారంభించింది. కానీ.. నేడు మార్కెట్ నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

తాగునీటి సమస్య

గ్రేటెడ్ కమ్యూనిటీ కాలనీలలో తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. మిషన్ భగీరథ నీటిని అందించాలని కొంతకాలంగా కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

అసంపూర్తిగా కల్యాణ మండపం

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో కల్యాణ మండపం లేకపోవడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. గత ప్రభుత్వం కల్యాణ మండపం కోసం భూమిని కేటాయించి, నిర్మాణం కోసం నిధులను మంజూరు చేశారు. ఆ తర్వాత కల్యాణ మండపం పనులు మధ్యలోనే ఆగిపోయాయి.

అసంపూర్తిగా రేడియల్ రోడ్లు

పదేళ్ల క్రితం శేరిలింగంపల్లి పరిధిలోని గోపనిపల్లి తండా నుంచి తెల్లాపూర్ మీదుగా రింగ్‌రోడ్డు వరకు రేడియల్ రోడ్డును అభివృద్ధి చేశారు. కానీ.. ఈ రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయకపోవడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడంలేదు.

చెరువులోకి మురుగునీరు

మున్సిపాలిటీ పరిధిలోని చెరువులు మురుగు నీటితో నిండిపోయాయి. గ్రేటెడ్ కమ్యూనిటీ కాలనీల నుంచి మురుగునీరు చెరువులోకి చేరుతోంది.



తెల్లాపూర్ మున్సిపాలిటీ వ్యూ

ఆధునిక ఆస్పత్రి కోసం ఎదురుచూపు

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రభుత్వ వైద్య సేవలు లేకపోవడంతో ప్రజలు ప్రవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. జనాభాకు సరిపడా ప్రభుత్వ ఆస్పత్రిని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

గత ప్రభుత్వం చెరువుల అభివృద్ధి కోసం రియల్ సంస్థలకు దత్తత ఇచ్చారు. కానీ.. పనులను మధ్యలోనే నిలిపివేశారు. చెరువుల్లోకి మురుగు నీరు రాకుండా మురుగు నీటి శుద్ధి ప్లాంట్‌లను ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

గ్రంథాలయం లేక ఇబ్బందులు

గ్రంథాలయం లేక యువకులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పుస్తకాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు గ్రంథాలయం లేకపోవడంతో చదువులకు దూరం మవుతున్నారు.

రైల్వేస్టేషన్‌కు దారిలేక...

తెల్లాపూర్‌లో రైల్వేస్టేషన్ ఉన్నప్పటికీ ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదు. రైల్వేస్టేషన్‌కు దారి లేకపోవడంతో ప్రజలు రైల్వేసేవలకు దూరమవుతున్నారు. రైల్వేస్టేషన్‌కు ఆనుకొని ఉన్న రేడియల్ రోడ్డు నెంబర్ 7కు అనుసంధానంగా రోడ్డును అభివృద్ధి చేస్తే స్థానికులకు రైల్వేసేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది..



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న మున్సిపల్ కార్యాలయం

తెలంగాణపురంగా పేరు మార్చాలని విజ్ఞప్తి

తెల్లాపూర్‌కు మంచి చరిత్ర ఉంది. పూర్వం తెల్లాపూర్‌ను తెలంగాణపురంగా పిలిచేవారు. అందుకు సంబంధించిన శాసనం తెల్లాపూర్‌లో ఉంది. తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ అగ్రనేతలు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే తెల్లాపూర్‌ను తెలంగాణపురంగా పేరు మారుస్తామని హామీ నిచ్చారు కానీ.. ఇప్పటివరకూ హామీ అమలుకు నోచుకోవడంలేదు.

డబుల్ బెడ్ రూం ఇళ్ల సమస్య

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో కొల్లూర్‌లో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో స్థానికులకు అన్యాయం జరిగిందని గతంలో స్థానిక నేతలు ఆరోపించారు. ఈ విషయంలో అర్హులైనవారికి న్యాయం జరిగేవిధంగా ప్రజాప్రతినిధులు మంత్రి దామోదర దృష్టికి తీసుకువెళ్లాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మిషన్ భగీరథ సర్వే పరిశీలన

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని తాటిపల్లి, పెద్దలోడి, పిల్లోడి, మల్లికార్జునపల్లి, తదితర గ్రామాల్లో మిషన్ భగీరథ పథకంలో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వేను గురువారం ఎంపీడీఓ హరినందర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఇంటింటికి వెళ్లి నల్లా కనెక్షన్ తదితర వివరాలను సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ పైపు లైన్ తీసుకొని నిరుపయోగంగా వదిలేసిన వాటి కనెక్షన్ తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా కిరాణం షాపుల్లో ఉండే ఇళ్ల యజమానుల వివరాలను నమోదు చేసుకున్నారు.

గురుకుల పాఠశాల సందర్శన



భోజన శాలను పరిశీలిస్తున్న ఎంపీపీ మొగులప్ప, ఎంపీడీఓ షరీఫ్

రాయికోడ్(అందోల్): మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను ఎంపీపీ మొగులప్ప, ఎంపీడీఓ షరీఫ్‌తో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాలలోని విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల వివరాలను ప్రిన్సిపాల్ మాన్విచంద్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. పాఠశాల ప్రాంగణంలో విద్యుత్ స్తంభాలు వేయాలని, కంపౌండ్ వాల్‌పై ఫెన్సింగ్ లేకపోవడం తదితర సమస్యలు ఉన్నాయని ప్రిన్సిపాల్ వివరించారు. దీంతో స్పందించిన ఎంపీపీ, ఎంపీడీఓ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

పంటల వివరాల నమోదు తప్పనిసరి

ఝరాసంగం(జహీరాబాద్): వానాకాలం సీజన్‌లో భాగంగా సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా వ్యవసాయశాఖ అధికారుల వద్ద నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్వర్ అన్నారు. మండల పరిధిలోని జీర్లపల్లి, దేవరంపల్లి, బర్దిపూర్, కృష్ణాపూర్, కుప్పానగర్ తదితర గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించి వివరాల నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల వివరాలు నమోదు చేయించుకుంటే నమోదు ఆధారంగానే కొనుగోలు కేంద్రాల్లో పంటను అమ్ముకునేందుకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. పంట సాగులో అధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు సుకుమార్, వినోద్‌కుమార్, హరికృష్ణ, శివప్రియ, జ్ఞానం, భారతి తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్

బీమా చెక్కు పంపిణీ

నారాయణఖేడ్: మండల పరిధిలోని డీఎన్‌టీ తండాకు చెందిన కేతావత్ శంకర్‌నాయక్ ఇటీవల ప్రమాదవశాత్తు మరణించారు. మృతుడికి బీఆర్ఎస్ సభ్యత్వం ఉండటంతో ఇన్సురెన్స్ ద్వారా మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును మృతుడి భార్య కేతావత్ గురబాయికి మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి గురువారం అందజేశారు. అదేవిధంగా రైతుబీమా ద్వారా మంజూరైన రూ.5 లక్షల బీమా ఓచర్‌ను సైతం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మీబాయి, విజిలెన్స్ కమిటీ సభ్యుడు రవీందర్‌నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్వర్, నాయకులు సత్యపాల్‌రెడ్డి, శేరి రామకృష్ణ, శేరి శ్రీనివాస్, రవీందర్, కురుమ సంఘం తాలూకా అధ్యక్షుడు మల్గొండ, నాయకులు నారాయణ, హరినాయక్, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌గౌడ్, దస్తగిరి పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

క్రీడా ప్రాంగణ స్థలాన్ని కాపాడండి

జిన్నారం(పటాన్‌చెరు): కబ్జాకు గురవుతున్న క్రీడా ప్రాంగణ స్థలాన్ని కాపాడేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు రవీందరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని 284 సర్వే నంబర్‌లో 30 గుంటల స్థలానిన్న క్రీడా ప్రాంగణం కోసం అధికారులు కేటాయించారన్నారు. ప్రస్తుతం ఈ స్థలం కబ్జాకు గురవుతోందన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించిద స్థలాన్ని పరిరక్షించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

కల్హేర్(నారాయణఖేడ్): హరితహారంలో మొక్కలు నాటాలని కల్హేర్ ఎంపీడీఓ శ్రీనివాస్ సూచించారు. కల్హేర్‌లో ఉపాధిహామీ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామ పంచాయతీలో మొక్కలు నాటి సంరక్షించేందుకు పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ శ్యామ్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ వేణుమాధవ్ పాల్గొన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కంది(సంగారెడ్డి): సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. కంది మండల కేంద్రంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో పదేండ్ల కాలంలో కంది మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసినట్లు వివరించారు. మండల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం ఎంపీటీసీలు, మాజీ సర్పంచులను ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఎంపీపీ సరళ, జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌గౌడ్, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు బుచ్చిరెడ్డి, కృష్ణగౌడ్, శంకర్‌గౌడ్, రాంరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు చంద్రి శ్రీనివాస్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలుపై నిలదీయాలి

సంగారెడ్డి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల పథకాల అమలుపై నిలదీయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పంట పెట్టుబడి సాయం ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఇటీవల ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పత్తి విత్తనాల కోసం బారులు తీరిన రైతులపై లాఠీలతో కొట్టించిందని ప్రభుత్వంపై మండిపడ్డారు. విత్తనాలు కూడా రైతులకు అందించకపోవడం ప్రభుత్వ చేతగాని తనానికి నిదర్శనమన్నారు. సాగు నీటి కొరత, కరెంటు కొరత, విత్తనాల కొరత, ఎరువుల కొరత ఇవన్నీ ఐదు నెలల కాంగ్రెస్ పార్టీ సాధించిన ఘనతలు అని ఎద్దేవా చేశారు. రైతును రాజును చేయాలనే ఉద్దేశంతో మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేశారని వివరించారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చిరెడ్డి, వెంకటేశ్వర్లు ,నర్సింగ్‌రావు, గోవర్ధన్, శ్రీనివాస్, మల్లేశం, జలెందర్, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

ఏటీఎం కార్డు మార్చి నగదు డ్రా

పోలీసుల అదుపులో నిందితుడు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఏటీఎం కార్డులు మార్చి నగదు విత్ డ్రా చేస్తున్న వ్యక్తిని రామచంద్రాపురం పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. వారి కథనం మేరకు.. పట్టణంలోని రామచంద్రారెడ్డి నగర్ కాలనీలోని ఏంటీఎం సెంటర్‌లో డబ్బుల డ్రా చేయడానికి పటాన్‌చెరు పట్టణానికి మహిళ తరుణం రెడ్డి ఈ నెల 10వ తేదీన వచ్చింది. మొదటి ప్రయత్నంలో నగదు రాకపోవడంతో అక్కడే ఉన్న ఓ యువకుడు ఆమెను మాటల్లో పెట్టి ఏటీఎం కార్డును మార్చి ఇచ్చాడు. ఆమె కార్డు తీసుకున్న సదరు యువకుడు పట్టణంలో ఓ పెట్రోల్ బంక్‌లో రూ.40 వేలు డ్రా చేశాడు. ఆ మెసేజ్ బాధిత మహిళకు రావడంతో ఆమె తన వద్ద ఉన్న కార్డు చూసుకుంది. కార్డు మారిపోయిందని పోలీసులు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు సీసీ కెమెరాలు, పెట్రోల్ బంక్‌లో యువకుడు ఇచ్చిన ఏటీఎం కార్డు ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. నిందితుడు కేబీహెచ్‌పీ కాలనీలోని హాస్టల్‌లో ఉండే గుంటూరు జిల్లావాసి ఎం.వెంకట కోటేశ్వరరావుగా గుర్తించారు. వెంటనే అతడిని అరెస్ట్ చేసి రూ.40 వేలు స్వాధీనం చేసుకున్నారు.



నిందితుడు వెంకట కోటేశ్వరరావు

సంక్షిప్త వార్తలు

27 మంది పిల్లలకు నీలం మధు నజరానా

పటాన్‌చెరు: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నీలం మధు ముదిరాజ్ నయా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జూన్ 19న రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా బుధవారం జన్మించిన 27 మంది పిల్లలకు ఒక్కొక్కరికి రూ.10 వేల నజరానాను ప్రకటించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. భారత్ జోడో యాత్ర ద్వారా దేశ ప్రజలందరినీ ఏకం చేసిన రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా తన వంతుగా ఈ సహాయం అందజేసినట్లు తెలిపారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

జహీరాబాద్: బేగరి నర్సింహులు హత్యకు బాధ్యులైన వారిని అరెస్టు చేసి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ గురువారం ప్రజాసంఘాల నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోహీర్ మండలంలోని బడంపేటకు చెందిన బేగరి నర్సింహులును అదే గ్రామానికి చెందిన కొందరు గత నెల 18న మూకుమ్మడిగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి అదే నెల 26వ తేదీన చికిత్స పొందుతూ మరణించాడన్నారు. ఈ కేసులో 9 మంది నిందితులుగా ఉండగా ముగ్గురిని మాత్రమే అరెస్టు చేశారన్నారు. మిగతా వారిని కూడా అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఆస్తిపన్ను బకాయిలు వసూలు చేయాలి

జహీరాబాద్ టౌన్: ఆస్తిపన్నుతో పాటు పాత బకాయిలను వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఆస్తిపన్ను రూ.6కోట్లు డిమాండ్ ఉందన్నారు. మొండి బకాయిలు రూ.3.50 కోట్ల వరకు ఉన్నాయన్నారు. ఈ విషయంపై బిల్‌కలెక్టర్లు, ప్రత్యేక బృందాలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ఎంఎస్ఎన్ పరిశ్రమలో స్వల్ప అగ్నిప్రమాదం

పటాన్‌చెరు టౌన్: ఎంఎస్ఎన్-2 పరిశ్రమలో స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పాశమైలారం పారిశ్రామికవాడలో ఎంఎస్ఎన్-2 యూనిట్‌లో గురువారం మధ్యాహ్నం స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో కార్మికులు రాజకుమార్, రూపేష్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన కార్మికులను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఇంకా ఫిర్యాదు రాలేదని పోలీసులు పేర్కొన్నారు.

నులిపురుగు నివారణకు కృషి చేద్దాం

ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: నులిపురుగుల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు నులిపురుగు నివారణ మందులు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 19 ఏళ్ల వయసు కలిగి ఉన్న పిల్లలకు నులిపురుగు నివారణ మందులను తప్పకుండా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు తంజీం, మొహియొద్దీన్, నారాయణ, వెంకటేశం, నామ రవికిరణ్, అబ్దుల్లా, నర్సింహాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శివప్ప, సత్యం ముదిరాజ్, వెంకట్, సాగర్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోండి

నారాయణఖేడ్: ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు రాజేశ్వర్, రాజుసేట్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నులిపురుగు మాత్రల పంపిణీ

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో నులిపురుగు నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ నర్సింహరెడ్డి విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జెబా, సిబ్బంది మాణిక్యం, బాలమణి పాల్గొన్నారు.

ఆత్మకూర్ ప్రభుత్వ పాఠశాలలో...

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని ఆత్మకూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ శంకర్ మాట్లాడుతూ నులి పురుగులతో మనిషి ఎదుగుదల ఉండదని, ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే తప్పకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, వైద్య బృందం, ఆశావర్కర్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలన మాత్రలు పంపిణీ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని న్యాల్‌కల్, మిర్జాపూర్(బి)పీహెచ్‌సీల పరిధిలోని ఆయా గ్రామాల్లో వైద్యులు ఇంటింటికి వెళ్లి నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మాత్రలను అందజేశారు.

ఝరాసంగం మండలంలో...

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్, మండల వైద్యాధికారి రమ్య, సీహెచ్ఓ సుదర్శన్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణపై అవగాహన

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నులి పురుగుల నివారణపై గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి, వైద్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా మాదారం, గుమ్మడిదల, జిన్నారం, తదితర గ్రామాల్లో నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు.



జహీరాబాద్: విద్యార్థినికి నులిపురుగుల మాత్రను వేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు



నారాయణఖేడ్: విద్యార్థినికి నులి పురుగుల మాత్ర వేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



కల్హేర్‌లో..



ఝరాసంగం గురుకుల పాఠశాలలో...



జిన్నారంలో..